# గురు దక్షిణ

అది పశుపతికి ఇష్టమైన ‘ప్యాంట్’. తమిళంలో దాన్ని ఏమని పిలుస్తారు? ‘మణిమేకలై’ కావ్యంలో తనెప్పుడో చదివిన పదబంధం అతనికి గుర్తుకి వచ్చింది. కాని దానికి అర్థం ‘వదులు వస్త్రం‘ – loose garment – ఈనాటి పైజామా లాగ అన్న మాట. అంటే ఆ రోజుల్లో అదే పదబంధం ‘ప్యాంట్’ని సూచించివుండాలి. కాని “తమిళులు ‘ప్యాంట్’ ధరించేవారా?” అని ఒక క్షణం పశుపతి ఆలోచించారు: ‘ఎందుకీ గొడవ, నిజారు అంటే సరిపోతుందికదా?’

ఇప్పుడు అతని ప్రశ్న: అతనికి నచ్చిన ముదురు ఎరుపురంగు నిజారుని నడములో స్థిరపరచి నిలిపే రెండు వంకీలు! అతను నిజారు ధరించడానికి ప్రయత్నించినప్పుడు ఆ రెండు వంకీలు వదులైపోయి నేల వాలాయి; అతను తిరిగి చుట్టూముట్టూ చూసారు.

అవి అతని కళ్ళకి కనిపించలేదు; మంచం అడుగున పడివుండాలి. తన దేహమంతా కురచపరచుకొని మంచం కింద తొంగి చూడడం అతనికి ఈ వయస్సులో అసాధ్యం. ఒక వేళ రాజకీయ వ్యవహారాల్లో పని చేసివుంటే అందుకు కావలసిన నైపుణ్యం నేర్చుకునే శిక్షణ అతనికి లభించివుంటుంది.

పశుపతి మంచంని పట్టుకొని నేలమీద కూర్చున్నారు. వొంగి మంచం అడుగున చూసారు. చీకటిగా ఉంది. వంకీలు కనిపించలేదు. నడుము ఇలుకుపట్టేసింది. చాలా ప్రయాసతో లేచి నిల్చున్నారు. ఆ వంకీలు దొరికినా అతను చేసేదేముంది? అతనికి కుట్టుపని చేతకాదు. పుస్తకాలకి అట్టలు వెయ్యడం కూడా అతనికి తెలీదు.

వంకీలు లేకపోవడం వలన ఆ నిజారుని పశుపతి త్యాగం చెయ్యడానికి సిద్ధంగా లేరు. అతని భార్య కన్ను మూయడానికి ఒక నెల ముందు అతని పుట్టిన దినంకి బహుమానంగా ఇచ్చిన నిజారు అది. దాన్ని తొడుక్కున్న రోజులన్నీ అతనికి శుభదినాలు! తపాలా ఆఫీసుకి వెళ్తే ‘క్యూ’ ఉండదు; సమకాలంలో భోజనం

'మెస్సు'నుంచి వచ్చేస్తుంది. ఎదురింటి పద్మనాభన్ రోజువారి ఘటనలగురించి తను వార్తాపత్రికలకి రాసిన ఉత్తరాలు చదివిచూపించరు . . . ఇలాగ ఎన్నో చిన్న చిన్న దీవెనలు వల్లించుకుంటూ పోవచ్చు . . .

పశుపతి నిజారుని ధరించడానికి మళ్ళీ ప్రయత్నం చేసారు. కాని అది అతని నడుములో నిలబడడానికి ఏకీభవించలేదు. పదిహేను సంవత్సరాలముందు కొన్న ఉడుపు కదా? ఈ రోజుల్లో ఇటువంటి వంకీలు కుట్టే మామూలు పనులకి దర్జీ ఎక్కడ దొరుకుతాడు? అమితా బచ్చన్, ఫియర్స్ బ్రోన్సన్ లాంటివారికి Designer Suits కుట్టి ఇచ్చే దుకాణాలకి పాత నిజారుతో ఏం పని?

Calling bell వినిపించింది. పశుపతి తలుపు తెరిచారు. పద్మనాభన్! అతని చెయిలో వార్తాపత్రిక లేదు; పశుపతికి నిమ్మళంగా ఉంది.

"బయటికి వెళ్తున్నారా?"

"వెళ్లాలనే ప్లాను . . . మిమ్మల్ని ఒకటి అడగాలి. నా ప్యాంట్ కి buckle పోయింది. దాన్ని కుట్టటడానికి ఎవడైనా దర్జీ దొరుకుతాడా?"

"అయ్యా, మీరు ఏ లోకంలో ఉన్నారు? కత్తులు వాడిచేసేవారు, గిన్నెలకి ములాం పూసేవారు - పాతరోజుల్లో - వీధికి వీధి వస్తూంటారు. మరి ఈ రోజుల్లో కనిపించరేం? లోకం మారుతోంది . . . ఒకటి, మీరే వంకీలు కుట్టుకోవాలి, లేకపోతే మన watchman కి ఇచ్చేయండి . . . ఇలాగ పాత దుస్తులు కుట్టి కుట్టి వాడామంటే, మనం ఎలాగ western economy తో పోటీపడడం?" అని పద్మనాభన్ అడిగారు.

పశుపతి మౌనంగా పద్మనాభన్ని కొంచెం సేపు చూసారు. తను చెప్పినది పశుపతికి అసమ్మతిగా ఉందేమో అనే అనుమానంతో అతన్ని ఊరడించాలని పద్మనాభన్ "ఇదేం కొత్త ప్యాంటా?" అని అడిగారు.

"కాదు. కొని పదిహేను సంవత్సరాలు ఐపోయాయి."

"పదిహేను సంవత్సరాలా? My God! ఏమైనా sentiment value?"

"సరిగ్గా చెప్పారు! అది నాకు బహుమానంగా ఇచ్చిన మా ఆవిడ కన్నుమూసి పదిహేను సంవత్సరాలు ఐపోయాయి."

"Oh, I am very sorry, Mr. Pasupati! Now I understand! ఒక పని చెయ్యండి. George Town వెళ్ళారంటే మీకు వంకీలు కుట్టడానికి ఎవడైనా దర్జీ దొరకవచ్చు. కాని, మీరు బస్సులో ప్రయాణం చెయ్యరు. Auto-rickshaw లో వెళ్ళిరావాలంటే ఆ ఖర్చుకి ఒక కొత్త ప్యాంట్ కొనవచ్చు. కావాలంటే అది మీ sentiment కి ఇచ్చే ధరగా భావించి వెళ్ళిరండి . . . " అని పద్మనాభన్ అన్నారు.

అతను వెళ్ళిన తరాత పశుపతి ఒక సంచెలో ఆ నిజారుని భద్రపరచి బయలుదేరారు. ఖాళీగా వెళ్తున్న ఒక ఆటోరిక్షాని ఆపారు. ఆటోరిక్షా నడిపేవాడు కూడా  అతనిలాగే వయసు చెల్లినట్టు కనిపించాడు.

"టవునికి వెళ్ళిరావాలి!"

సారధి పశుపతిని తేరిపార చూసాడు.

"ఎంత ఇస్తారు?"

"250 రూపాయలు? . ."

"పైగా 50 రూపాయలు ఇవ్వండి సార్ . . . ఎక్కండి."

పశుపతి ఎక్కి కూర్చున్నారు. బండి బయలుదేరింది. కొంత దూరం వెళ్ళగానే సారధి నిద్రపోతున్నారేమో అని పశుపతికి అనుమానం కలిగింది; అంత మెల్లగా అతను బండిని నడిపారు.

"ఎందుకు ఇంత మెల్లగా వెళ్తున్నారు?"

"పిల్లకాయలుగా ఉన్నప్పుడు మనం కాళ్ళకి రెక్కలున్నట్టు ఎగిరేవాళ్ళం. ఇప్పుడు వయస్సు చెల్లిన తరువాత ఇంకా ఎన్ని రోజులు ఈ బతుకు? ఇప్పుడు లోకంని నిదానంగా చూసి ఆనందించుదాం! . . . తొందరపడకుండా మరికొన్ని సంవత్సరాలు గడుపుదాం! . . . " అని చెప్పి అతను నవ్వారు.

ఒక ఆటోరిక్షా తోలేవాడు తత్వబోధన చేస్తాడని పశుపతి ఎదురుచూడలేదు.

"నేను ముసలాడైపోయాను. నాకేం తొందర లేదు. నేను కూడా మీలాగే లోకంని నిదానంగా చూడడానికి సిద్ధంగా ఉన్నాను. కాని ఆఫీసుకి వెళ్ళే పిల్లకాయలు మీ బండిలో ఎక్కితే మీరేం చేస్తారు?"

“వాళ్ళు ఎక్కి కూర్చున్నవెంటనే చెప్పేస్తాను: ‘ఇదిగో, వినండి. ఈ బండి మెల్లగానే సాగుతుంది. మీకు తొందర అంటే వేరే బండిలో వెళ్ళండి.”

పశుపతి నవ్వారు. “సరే, ఈ వయస్సులో మీరెందుకు ఈ బండి నడపాలి? పిల్లలెవరూ లేరా?”

“నేనెలాగో ఆటోరిక్షా నడుపుతున్నాను. నాకంటే ఎంతమంది ఈ మండుటెండలో, చెమట కక్కుతూ, ఆదరాబాదరాగా బళ్ళు నడపడం మీరు చూసారా? భారత దేశం గురించి గొప్పగా వార్తాపత్రికలలో రాస్తున్నారు. గొప్పవాడు ఇంకా గొప్పవాడైపోతున్నాడు. బీదలు బీదలుగానే ఉన్నారు. పేదరైతుల పొలాలు లాగ్గొని కంప్యూటర్ పార్కులు కట్టుతున్నారు. లేకపోతే ఎందుకు ఇంతమంది రైతులు ఆత్మహత్యతో చావాలి? పేదరికమే కారణం. ఆ అవస్థ నాకూ రాకూడదని నేను బండి నడుపుతున్నాను. ఏమంటారు?”

“మీరన్నది నిజం” అని పశుపతి ఆమోదించారు. అతను పిల్లలగురించి అడిగిన ప్రశ్నకి జవాబు రాలేదు. కాని పశుపతి మళ్ళీ అడగలేదు. సారధి ఆ తరువాత మాటాడలేదు. బండి మామూలు వేగంలో సాగింది.

“టవును వచ్చేసింది. మీరు ఎక్కడికి వెళ్ళాలి?” అని సారధి అడిగినప్పుడే తను నిద్రపోవడం పశుపతి గ్రహించారు. కళ్ళు తెరిచి పరిసరాలు చూసారు.

“అడ్రస్ ఉందా?”

పశుపతి సంచెనుంచి నిజారు తీసి అతనికి చూపారు: ‘ఈ ‘ప్యాంట్’ కి వంకీలు పోయాయి. దీన్ని కుట్టాలి. ఈ చిన్న పని చెయ్యడానికి దర్జీ ఇక్కడ దొరుకుతాడా?” అని అడిగారు.

“అరేరే, ఇందుకేనా ఆళ్వార్ పేట్ నుంచి మీరు ఇంత దూరం వచ్చారు? అని సారధి పశుపతిని తేరిపార చూసారు.

“చిన్నపనులు చేసే దర్జీలు ఇప్పుడు ఎక్కడున్నారు? అన్నీ పెద్ద పెద్ద దుకాణాలు. చిన్నదుకాణాలు టవునులో ఉంటాయని నా ఫ్రెండు చెప్పారు.” అన్నారు పశుపతి.

“ఆళ్వార్ పేట్, మైలాపూర్ లో చిన్నపనులు చేసే దర్జీలు మీ కళ్ళకి కనిపించలేదని చెప్పండి. అందరికీ City Central, Spencer Plaza లో ready-made దుస్తులు కొనడం సాధ్యం కాదే? ఎనిమిదవ మేడ అంతస్తునుంచి కింద చూస్తే చీమలు కనిపిస్తాయా? మీరు ఎనిమిదవ మేడ అంతస్తులో ఉంటున్నారు. మీ కళ్ళకి ఆళ్వార్ పేట్ లో చిన్న పనులు చేసే దర్జీలు కనిపించలేదన్న మాట!”

“అలాగేం కాదు. నేనుండేది భవనంలో కాదు. ఎప్పుడో చేసిన ఉద్యోగంకి వచ్చే ఫించనుతో నేను రోజులు గడుపుతున్నాను. ఇలాంటి పాత ప్యాంట్ కి వంకీలు కుట్టుకొనడమే నాకు అలవాటు! సరే, ఆళ్వార్ పేట్ లో మీకు తెలిసిన దర్జీ ఉంటే చెప్పండి, తిరిగి వెళ్దాం!” అన్నారు పశుపతి.

“ఇంత దూరం వచ్చాం, ఇక్కడే ఉన్నారా అని చూద్దాం . . . ” అన్నారు సారధి.

కొంచెం దూరం వెళ్లగానే, “అదిగో, ఆ దుకాణం చూసారా?” అని అతను అడిగారు.

“పెద్ద దుకాణంలాగుందే? మన కుట్టుపనికి . . . ”

“అడిగి చూడండి . . . అడిగితే ఏం తప్పు?”

పెద్ద దుకాణమే. ప్రవేశించగానే శీతల గాలి ఆహ్లాదం; ఖాతాదారులందరూ యువకులుగా కనిపించారు. ఇతరులు సూట్లూ, కుర్తా, షెర్వాణీ వంటి ఆడంబర దుస్తులు కుట్టించుకోడానికి వచ్చినవారు. సొగసుగా దుస్తులు ధరించి, చిరునవ్వుతో స్వాగతం చెప్పే యవకుడు కనిపించగానే తన సంచీలో ఉన్న పాత నిజారుని తీసి అతన్ని అడగడానికి అతనికి మొహమాటం కలిగింది. ‘వద్దు, తిరిగి వెళ్లిపోదాం’ అని పశుపతి నిశ్చయించారు. కాని ఇంతలో ఒకతను అతన్ని చూసి లోపలకి రమ్మన్నారు.

పశుపతి తడబడుతూ “ఇదేం పెద్ద పని కాదు . . . ” అని అంటూ సంచెనుంచి నిజారుని తీసి, దాన్ని చూపి అడిగారు: “ఇది చాలా పాత ప్యాంట్, కాని నాకు sentimental value ఉంది . . . దీని . buckle పోయింది. మీరు దీన్ని కుట్టగలరా? ”

యువకుడు అతన్ని చూసి చిరునవ్వు నవ్వాడు. ఆ చిరునవ్వుకి అర్థం ఏమిటో పశుపతి తెలుసుకున్నారు. నిజారుని సంచెలో పెట్టి "సరే, నేను వస్తాను . . . " అని అన్నారు. యువకుడు అతన్ని చూసి మళ్ళీ చిరునవ్వు నవ్వాడు.

పశుపతి తన ఆటోరిక్షాని చేరుకున్నప్పుడు సారధి భోంచేసి చేతులు కడుక్కోవడం చూసారు. "అయ్యా, మీరు భోంచేసిన తరువాతసే కదా బయలుదేరారు?" అని సారధి అడిగారు.

"అవును."

"వెళ్ళిన పని ఏమైంది?"

"నా నిజారుని చూడగానే దుకాణంవాడు నవ్వేసాడు. నేను వచ్చేసాను." సారధి నవ్వాడు.

"ఈ చెల్లిన వయస్సులో, ఈ ఎండలో, పాత నిజారు వంకీలు కుట్టడానికి మీరు ఊరకే తిరుగుతున్నారు. నాకూ 300 రూపాయల కిరాయి ఇవ్వాలి! మీకు చోద్యంగా లేదూ?

"నిజారు పాతదే, కాని అది మా ఆవిడ నా పుట్టినరోజు బహుమానంగా, పదిహేను సంవత్సరాలముందు ఇచ్చిన నిజారు. మీకిప్పుడు బోధపడిందా?" అని అడిగారు పశుపతి.

సారధి కొంచెం సేపు ఆలోచించారు. "చెప్పండి, మీరు పోతే ఈ నిజారు మీతో వస్తుందా? నేనూ చుట్టరికం, బంధుత్వం అనుభవించివున్నాను. కాని ఆ మోజులన్నీ ఇక వద్దని వదిలేసాను. ఇప్పుడు నా జీవితంలో ఎటువంటి చిక్కులూ లేవంటే నమ్ముతారా?"

"మీరేమంటున్నారు? ఈ పాత నిజారుని ఈ వీధిలో విసిరేయాలంటున్నారా?" అని అడిగారు పశుపతి.

"విసిరేయవద్దు. పాతదైనా నిజారు చినిగినట్టు కనిపించదు. చూడడానికి బాగుంది. మరెవరికైనా ఇస్తే వాళ్ళు కుట్టించుకుంటారు. మీ ఆవిడ ఆత్మకి శాంతి కలుగుతుంది" అన్నారు సారధి.

కొంచెం సేపు ఆలోచించి పశుపతి అడిగారు: "మీరు అపార్థం చేసుకోకూడదు. మిమ్మల్ని ఒకటి అడగవచ్చా?"

"అడగండి."

"మీరే దీన్ని తీసుకుంటారా?"

సారథి అతని మొహంలో ఎటువంటి చలనమూ లేకుండా పశుపతిని చూసారు. **అతను** మరేమీ అనలేదు. పశుపతికి తను అతన్ని అలాగ అడిగినది పొరబాటేమో అనిపించింది. ఇల్లు చేరినంతవరకూ సారథి మాటాడనేలేదు. బండినుంచి దిగినవెంటనే పశుపతి అన్నారు: "Sorry,! మిమ్మల్ని నేను అడిగినది తప్పు. ఏదో ఆలోచనలో అడిగేసాను! నన్ను క్షమించండి!"

"ప్యాంట్ ని నాకివ్వండి!" అన్నారు సారథి. "నేను ప్యాంట్ తీసుకుంటాను. కాని ఒక condition మీద. మీరు నాకు 300 రూపాయలు ఇవ్వనక్కరలేదు. అదే మన కిరాయి. నాకు ఎవరిదగ్గరా దానంగా ఏదీ పుచ్చుకొనే అలవాటు లేదు. మీ sentiment కి నేను ధర చెప్తున్నాను అని కాదు. నేను ఆ డబ్బు తీసుకుంటే నాకు నిద్ర రాదు. అదే నేను నా నిద్రకి ఇచ్చే వెల."

"ఇది దానం కాదు. దక్షిణ. మీరే నా గురువు. మీ దగ్గర నేను ఎన్నో నేర్చుకున్నాను" అన్నారు పశుపతి.

నిజారుని తీసుకొని పళుపతి చెప్పిన మాటలు చెవుల్లో వినిపించనట్టు సారథి త్వరగా ఆటోరిక్షాతో వెళ్ళిపోయారు.

ముందుకంటే బండి ఇప్పుడు కొంచెం వేగంగా వెళ్తున్నట్టు పశుపతికి అనిపించింది.

*******